స్కెచ్

# పట్టాలమీద రైలుబండి

యస్. ఆర్. వారణాశి

శర్మ మామగారివద్దనుంచి వచ్చిన ఉత్తరం చూశాడు. ఉత్తరం ఒకవిధంగా అతనికి చాలా ఉత్సాహం ఆనందం ఇచ్చిందనే చెప్పాలి. వచ్చే "సంక్రాంతి"కి రమ్మని ఆహ్వానం మనశ్శాంతి నిచ్చింది. సంక్రాంతిపండుగ తలుచుకుంటే గిర్రున భావపరంపరలు అతనిమనస్సులో జెర్రుల్లా పరుగెత్తాయి. క్రిందటి పండుగనాటిమధురస్మృతులు ఒక్కసారిగా తన మనోదృక్పథానికితట్టాయి.

శర్మ విద్యాధికుడే. బి. కామ్. పూర్తి చేశాడు ఆరుమాసాల పరీక్షలలో. ఫైనలు ఇయరులో పెళ్ళి అయింది. పెళ్ళిఅయిన ఏడే పరీక్ష తప్పింది. వాస్తవానికి తన పరీక్ష తప్పడం తన లోపంవలనే. అయినప్పటికీ లోకులు కాకులు. శారద అడుగుపెట్టిన వేళావిశేషం అనే అంతా అన్నారు. శారద రామారావుగారి పుత్రిక. ఒకతే కూతురు. గారాబంగా పెరిగినపిల్ల. ఆమె ఆఊరు అందాలరాణి. రామారావుగారు శారదను శర్మ కిచ్చి వివాహంచేయడంలో ఆంతర్యంలేకపోలేదు. శర్మ తండ్రిది జమీందారీఎత్తు. పెద్ద వ్యవహారత. పలుకుబడి చలాయించేవ్యక్తి. సుక్షేత్రమైన పది ఎకరాల మాగాణి ఉంది.

శర్మ భోజనానంతరము వారపత్రిక పేజీలు తిరగేస్తున్నాడు. భోజనంచేసి వాలుకుర్చీలో పరున్న శర్మతండ్రి చుట్టకాల్చుతూ పొగలుగుప్పుతున్నాడు. వంటింటిలోపనిపూర్తిచేసుకొని శర్మ తల్లి శాంతమ్మగారు హాలులోకి చక్కావచ్చారు. అంతాకలిసి శర్మ పండుగకు వెళ్ళాలని నిశ్చయించారు బాధ్యతను వెళ్లబోస్తూ. శర్మ నా అభ్యంతరం లేదన్నట్లు చూపులుచూశాడు.

శర్మ అత్తవారింటికివెళ్ళటం ఇది మొదటిసారి కాదు. అల్లుడువచ్చాడన్న పొత్తిపొంగే సంతోషాతిశయంలో అత్తగారు అల్లుణ్ణి కుశలప్రశ్న వేశారు. పరీక్ష ప్యాసుఅయినట్లు తెలిసి సంతోషించామన్నారు. ఏమి సమాధానంచెప్పాలో శర్మకు అవగతంకాక ఒక చిరునవ్వునవ్వాడు. శర్మ దృష్టి అంతా ఒకేవ్యక్తిగురించి. ప్రక్కగది లోంచి శారద మెరుపుతీగలా ఒక్కసారిగా మెరిసి చటుక్కున దొడ్డిలోకి చక్కాపోయింది. వెన్నెల పిండారబోసినట్లుంది. ప్రకృతి అంతా శోభాయమానంగాఉండి శృంగారదోహదకరంగా ఉంది. అల్లుడు వచ్చాడన్న సంతోషంతో అత్త గారు చురుకుగా వంటచేశారు. వేపుడుకూరతో కమ్మనిపెరుగుతో అల్లుడుమామల భోజనాలు అయ్యాయి. రామారావుగారు అల్లునిరాకకు మురిసిపోయారు.

అయినా శర్మకు ఏదో లోటుగానే ఉంది. కొన్నాళ్ళు కొమ్మపై కోకిల కమ్మగాపాడి ఎగిరిన తదుపరి మామిడి గున్నలా ఉంది అతని హృదయం. ఏదో ఆరాటం. శారద తన గదిలో వాయిస్తూన్న హార్మనీస్వరం అతని హృదయంలో మోడులను చిగురింపజేస్తోంది. మామగారితో సంభాషణలు తనకు మొక్కుబడిగామాత్రమే అనిపించాయి. ఆయన రాష్ట్రంలోని పరిస్థితులను సమీక్షిస్తూ ఆంధ్రులకు ప్రాజెక్టులవిషయంలో జరిగే అన్యాయాన్ని గురించిప్రస్తావించి, రాబోయే భూసంస్కరణలు ఏమైనా మనకు అపకారిగా ఉండగలవా అంటూ శర్మవైపు పరికించిచూశారు. శర్మ ఆలోచనా నిమగ్నుడైనట్టు రామారావుగారు గుర్తించకపోలేదు. శర్మ తంజావూరు ఆర్డినెన్సు గురించి చెప్పి రాష్ట్రవ్యాప్తంగా అదే అమలులోకి రావచ్చునని గుక్క తిరగకుండా చెప్పి బాధ్యత తీరినట్టుగా ఊరుకున్నాను. ప్రయాణ బడలిక కనుక పెందలకడ నిద్రపొమ్మని సలహా చెప్పి రామారావుగారు లోనికి వెళ్లిపోయారు.

శర్మకు నిద్రపట్టలేదనే చెప్పాలి. క్రిందటి పండుగనాడు శారద మేనమామ ప్రోత్సాహం వలన తాంబూలం చేతబట్టి ప్రక్క కిటికీలోంచి వచ్చేపిల్ల వాయువుకి తన పైవాటుకండువా ఒత్తిగిలి పడుతూంటే తాంబూలము యిచ్చి తుర్రున

పారిపోయింది. అలా తలుచుకుంటూనే నిద్ర పోయాడు అర్ధరాత్రివేళ.

మరునాడు శర్మ వచ్చినట్లు తెలిసి ఊళ్ళో కరణంగారి అబ్బాయి శంకరం చూడటానికి వచ్చాడు. కాఫీలు పుచ్చుకొని వారు పిచ్చాపాటీ మాట్లాడుకొన్నారు. శంకరం ఒకడే ఆ ఊళ్ళో డిగ్రీ పుచ్చుకొన్న వ్యక్తి. భావాలు, ఆదర్శాలు నూతన పంథాలో నడిచే మనిషి శంకరం. ప్రతివిషయం కూలంకషంగా చర్చించి వ్యక్తిగత అభిప్రాయానికి వచ్చేమనిషి. ఫలానా రాజకీయ వేత్తగాని, ఫలానా పత్రికాధిపతి కాని సెలవిచ్చిన అభిప్రాయాన్నే వేదవాక్కుని వెర్రిపోయే కొందరు ప్రస్తుత విద్యాధికుల పోకడలలో వాడుకాదు. విద్యావిధానంలో మార్పులు చాల రావాలన్నాడు. ప్రజాపరిపాలన వచ్చి ఐదు ఏండ్లు అయినప్పటికీ అసెంప్లాయిమెంటు ప్రోబ్లెం తీరలేదన్నాడు. శర్మకు ఈ ధోరణి కొంచెం అర్థరహితంగానే ఉంటుంది. కారణం తను ఇంకా ఉద్యోగాన్వేషణ చేయలేదు కనుక.

శంకరం తండ్రి పట్టి ఛాందసుడు. "వద్దు వద్దంటే ఈ ఇంగ్లీషులో చదువులో పెట్టావు. మెరక పొలం శిస్తుఅంతా వాడిక్రిందే అయిపోయింది. ఇంగ్లీషు చదువు అచ్చి రాదంటే విన్నావూ" అన్న కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానుల తంతు ఆయనది. ఈ అఘాయిత్యం మాటలకు సరకుచేయక శంకరం విద్య నభ్యసించాడు. గట్టెక్కాడుకూడా పట్టుదలతో. కాని అతనికి రెండేరెండు చిక్కు సమస్య లున్నాయి. ముక్కుపసలారని తన విధవ చెల్లి వరలక్ష్మి భావి, తన ఉద్యోగ అన్వేషణ. ఇవి పరిచితుడగు శర్మతో చెప్పి తనకు బరువు తగ్గినట్లుగా ఊరుకున్నాడు శంకరం.

పండుగనాడు పదింటికల్లా భోజనాలయాయి. శర్మలో ఒక నూతనశోభ ఉట్టిపడుతూ ఉంది. బహుశా సంక్రాంతి ఆనందశోభేమో! మంచి హైస్పిరిట్సులో ఉన్నాడు శర్మ ఆ రోజంతా. పొందూరు ఖద్దరుచీర ధరించి తెల్లనిరవిక తొడిగి, తలలో పూలవాసన ఘుమఘుమలుకొట్టగా శారద గానకోకిలలా తన గదిలో పాడుకుంటూన్నది. శారద హార్మోనియంమీద క్రొత్తగా చూసిన "మల్లీశ్వరి" లోని "పిలచినా బిగువటరా. హాళి రాజా" అన్న పాట చెవులు తుప్పవదిలేలా పాడుతూంది.

శర్మ తనభార్య గానకోకిలని లోలోన సంతోషించేవాడు. శారద కార్యం కానిపిల్ల భర్తతో మాట్లాడకూడదన్న తత్వంగల మనిషి. అందుకు ఆమెను నిందింపపనిలేదు. ఆమె అలాంటి వాతావరణంలో పెరిగి పెద్దయినది. అది శర్మకునచ్చదు. ఇదే సంఘర్షణ వారిద్దరికీ.

సాయంకాలంచల్లగాలికి శర్మ శంకరం పంటకాల్వవైపు పోయారు. పంటకుప్పలుపై లక్ష్మి తాండవమాడుతున్నది. చెరకు గానుగులు జోరుగా ఆడుతున్నారు. గట్టున నడుస్తూ చేలబోదిగట్టులపైనున్న కందికాయలు కోసి తింటూ నడుస్తున్నారు. శంకరం అన్నాడు "వీరేశలింగం గారి వర్ధంతులు దేశంలో ముమ్మరంగా జరుగుతూనే ఉన్నాయి. ఆయనకృషి యిప్పటికీ ఫలించకపోవడం శోచనీయం. గురజాడవారి సందేశం ప్రజలు పాటించక పోవడం గర్హనీయం కాదన్నాడు. శాంతారాం"దహేజు"లోని అంతరార్థం గ్రహించకపోవడం చాలా దురదృష్టమన్నాడు. సంఘం గ్రుడ్డిది. సంఘంపేరిట ఎంతమంది అమాయకులు బలి అవుతున్నారో లెక్కలేదు. కాల ప్రవాహంలో మానవపరిణామాలు రాకపోవడము దేశమునకు అనర్థం" ఈ ఫిలాసఫీ శర్మకు "ఫారిను"గానే ఉంది. శంకరం తన చెల్లి వరలక్ష్మిని మనస్సులో ఉంచుకుని తన అక్కసును వెళ్ళగ్రక్కున్నాడు. అది శర్మకేమి అర్థం అవుతుంది? చీకటి పడుతూంటే వారు గృహోన్ముఖులయ్యారు.

శర్మ తండ్రి స్థానికోన్నత పాఠశాలలోటీచరు పోస్టు శర్మకై ఖాయం చేయించాడు. నిజానికి శర్మకిది సుతరామూ ఇష్టంలేదు. బ్రతకలేక బడిపంతులు ఉద్యోగం అన్నారు. శర్మ బికామ్ చదివింది మాస్టరు పనికా? తాను ఏ రిజర్వ్ బ్యాంకులోనో పనిచేయాలని వాంఛ. మానవుడు జీవితంలో ఇష్టంలేని పనులుకొన్ని చేయాల్సివస్తుంది. అందుకనే శర్మ తండ్రిమాట కాదనలేక పోయాడు.

శర్మ అత్తవారి వద్దనుంచి ఉత్తరం వచ్చింది. శారదకు జ్వరం, లంకణాలు. గిర్రున కళ్ళలో నీళ్లు తిరిగాయి శర్మకు. తండ్రి కార్యం ముహూర్తం

పెట్టమని రెండు రోజులక్రితం వ్రాసిన ఉత్తరం గబుక్కున జ్ఞప్తికి వచ్చింది. శర్మ వెళ్ళి చూడాలనుకున్నాడు. కాని తను వెళ్ళటం ఎలా? చేరి పదిరోజులయినా కాలేదు అప్పుడే లీవుఇస్తారా? శర్మ తలిదండ్రులు వెళ్ళారు శారదను చూడటానికి. జ్వర తీవ్రం తగ్గటలేదు, ఆరోజుకారోజు చిక్కి శల్యం అవుతోంది. టైఫాయిడ్ అని డాక్టరు క్లోరో మిస్టిన్ ట్యూబ్ వెనక ట్యూబ్ వాడుతున్నాడు. మూడవవారంలో సంధి ఎక్కువైంది. శర్మకు వైరు ఇచ్చారు.

శర్మకు చూపుమాత్రం దక్కింది. శారద మరణం అతని హృదయంలో ఒక తీరనిమార్పు కలిగించింది. శారదను అపరిమితంగా ప్రేమించాడు. ఆ ప్రేమైక వస్తువు తన్ను విడిచినప్పుడు అతని హృదయం చలించింది ఒక్కసారిగా. ఆమె ఆకస్మిక మరణం పిరికివానిగాను అవివేకిగాను అతన్ని చేసింది. తనజీవితం చలనంలేని కొలనులా ఉంటుదని ఆశించాడు. విధి వైపరీత్యానికి మానవులు తలఒగ్గ వలసినదేకదా! అని వాపోయాడు.

వేడి చల్లారేవరకు శర్మను ఎవరు మాట్లాడించ దలచేలేదు. పెళ్లి కబుర్లు అతనికి తెలియకపోలేదు. పెళ్లిళ్ల పేరయ్యలు చుట్టుముట్టుతున్నారు. శర్మకు ఇదంతా ఏహ్యంగా కనబడింది. కాని తాను జీవితప్రాంగణంలో ప్రథమ దశలోనే వున్నాడు. జీవితాన్ని రుచిచూడలేదు. అప్పుడే తను వేదాంత ధోరణి అవలంబించడం పిరికితనం అని హృదయం చాటుతోంది. శర్మ డైలమాలో పడ్డాడు.

శంకరం శర్మను చూడడానికి వచ్చాడు. ప్రపంచంలో శాశ్వతం అయింది ఏమీలేదు కీర్తి ప్రతిష్ఠలు తప్ప అని ఊరడించాడు. తన చెల్లెలు వరలక్ష్మి భర్త వెళ్ళయిన వెంటనే పోయినట్టు చెప్పి,జీవితంలోకష్టసుఖాలను సమంగాచూడాలని బోధించాడు. శర్మ బడిపంతులు అవడం-భార్యా వియోగం కొద్దిరోజుల తేడాలోనే సంభవించాయి. తను బడిపంతులుగానే జీవితం గడుపుతున్నాడు.

శంకరందగ్గరనుంచి శర్మకు ఉత్తరాలు తరచు వస్తూనే ఉన్నాయి. విపత్కర విపరీత పరిస్థితులకు లొంగి మానవుడు వ్యక్తిత్వం కోల్పోరాదని హెచ్చరిస్తూ శంకరం వ్రాస్తూండేవాడు. శర్మ తల్లిదండ్రులు ఇప్పుడైనా మేనరికం చేయాలని సంకల్పించారు. ఘటనలేక ముందుగా మేనరికం కుదరలేదని ఇప్పుడైనా సంబంధం చేసుకోవాలనీ వారి భావం. శర్మకు సుతరామూ ఇష్టంలేదు. తాను అత్తవారూరిలో వరలక్ష్మిని శంకరం ఇంటికి వెళ్ళినప్పుడు చూడకపోలేదు. ఆమెది చిన్నవయస్సే, భగ్నహృదయై ఆకురాల్చిన మోడులా ఆమె జీవితం గడుపుతోంది. అలాంటి అవస్థ తనకూ పట్టినందుకు దిగులుపడేవాడు. ఆమెను తను పెళ్ళిచేసుకొని ఉద్ధరించా లనుకున్నాడు. కాని ఎలా సాధ్యం? సంఘం ఒప్పుతుందా? అగ్నిహోత్రావధానులుగారు అలాంటిది బ్రతికుండగా జరగనీయరే?

శంకరం అమాత్రం గ్రహించకపోలేదు. ఉత్తరం వ్రాశాడు. "ప్రస్తుతం సంఘం సమాజం అన్న పదాలకి అర్థంపోయింది జీవిత రేఖలు చిగుర్చి వికసించాలని ఉండడం మానవ నైజం. నీవు భగ్నహృదయుడవు. వరలక్ష్మి మనోరథం భగ్నమయింది. జీవితాలలో - ప్రాయంలోనే కష్టాలకు గురికావడం చాల హృదయ విదారకం. నీవు వరలక్ష్మిని పెళ్లాడితే..."

కలం ఆగింది క్షమించు. ఇట్లు,
శంకరం.

శర్మకు విలువలు తెలిశాయి. వరలక్ష్మి పేరు మార్చాడు. శారద అని పేరుపెట్టాడు. జీవితం పట్టాలమీద రైలులా నడుస్తోంది. చీకటి తర్వాత వెలుగు, వెలుగు తర్వాత చీకటి చూస్తామనుకోవడం లోకానికి ఒక వెర్రి అయిపోయింది. కొందరి జీవితాలు వెలుగులోనే తెల్లవారిపోతాయి. మరి కొందరు వెలుగు వెంటనే చీకటి చూసి అందులోనే నశించిపోతారు. కాని చాల మందికి జన్మంతా చీకటిలోనే గడచిపోతుంది. ఇవే జీవితరేఖలు.

---

ఒకరకంగా చూస్తే జలుబుచెయ్యడం ప్రేమలో పడడంవంటిది. పట్టుకున్నప్పుడు రెండూ మహాబాధపెడతాయి. కాని వదిలిపోయాక ఎంత హాయి!